నమస్తే తెలంగాణ
# వరంగల్
5 | వరంగల్, మంగళవారం 21 జనవరి 2025 | WARANGAL



జనగామలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

## ప్రశ్నించండి.. చర్చ పెట్టండి..

- మోసపోయి గోసపడుతున్నం
- ప్రస్తుత ప్రభుత్వ తీరును ప్రజలకు వివరించాలి
- ఏడాదిలో కాంగ్రెస్ సర్కారు ఏం చేసిందో అడగండి
- స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి
- కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే పల్లా

జనగామరూరల్, జనవరి 20: ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ సర్కారు పూర్తిగా విఫలమైందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆ పార్టీ మోసాలు, అబద్ధాలపై ప్రజల్లో చర్చ పెట్టాలని, ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రశ్నించాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం జనగామ మండలం యశ్వంతాపూర్ బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో బచ్చన్నపేట, జనగామ మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన పల్లా మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలనను, ప్రస్తుత ప్రభుత్వ తీరును ప్రజలకు వివరించాలన్నారు. ఏడాదిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందో అడగాలన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన దొంగ హామీలకు మోసపోయి గోసపడుతున్నామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించాలని, ప్రజలతో కలిసి పని చేయాలని, ప్రతి ఊరిలో గులాబీ నేతలను గెలిపించి బీఆర్ఎస్ సత్తా చాటాలన్నారు. ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి రైతులందరికీ రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించి సగం మందికి కూడా ఇవ్వలేదన్నారు. గత ప్రభుత్వం రైతులకు ఏడాదికి రెండుసార్లు ఎకరానికి రూ.10 వేల చొప్పున రైతుబంధును పంట సాగుకు ముందే అందించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డుల పేరుతో ప్రజలను మభ్య పెడుతున్నదన్నారు. బీఆర్ఎస్ పోరాట ఫలితంగానే రేషన్ కార్డుల జారీని నిరంతరం కొనసాగిస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. మంత్రులంతా అబద్ధాలు అడుతున్నారని, 80 లక్షల మంది దరఖాస్తు చేసుకుంటే కేవలం 6 లక్షల మందికే కార్డులిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అర్హులకు రేషన్‌కార్డులు ఇవ్వకపోతే నిలదీస్తామని పల్లా హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయాసిద్దులు, బచ్చన్నపేట పీఏసీఎస్ చైర్మన్ పూర్ణచందర్, వైస్ చైర్‌పర్సన్ మద్దికుంట రాధ, మాజీ ఎంపీపీ మేకల కళింగరాజు, బావండ్ల నాగజ్యోతీకృష్ణంరాజు, బచ్చన్నపేట సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు గంగం సతీశ్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు దూడల కనకయ్యగౌడ్, నాయకులు చంద్రారెడ్డి, కొండి వెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి, నరేందర్, ఉపేందర్‌రెడ్డి, గాడిపల్లి ప్రేమలతారెడ్డి, యాదగిరిగౌడ్, రామకృష్ణ, యాదగిరిరెడ్డి, సిద్ధారెడ్డి, కిష్టయ్య, ఫిరోజ్ పాల్గొన్నారు.

- అభాసుపాలవుతున్న ప్రజా పాలన
- కట్టలు కట్టి మూలకు పడేసిన అధికారులు
- ఒక్క గ్రేటర్ వరంగల్‌లోనే 15 వేల దరఖాస్తులు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలల్లో ఉన్నవైనం
- నమోదుకు అవకాశం ఇవ్వని ప్రభుత్వం
- సర్వే జాబితాల్లో పేర్లు లేక లబ్ధిదారుల ఇబ్బందులు

కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్భాటంగా స్వీకరించిన ప్రజా పాలన దరఖాస్తులు మూలకు పడ్డాయి. సర్కారు నిర్వాకంతో వాటిని ఆన్‌లైన్ చేయకుండానే అధికారులు పక్కకు పడేశారు. నమోదుకు కొద్ది రోజుల సమయమే ఇవ్వడంతో పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ చేయలేకపోయారు. దీంతో మిగిలిన దరఖాస్తులను కట్టలు కట్టి కార్యాలయాల్లోని గదుల్లో నిల్వ చేశారు. ప్రస్తుతం నాలుగు పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం జరుగుతున్న సర్వే జాబితాల్లో పేర్లు లేక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, సిబ్బందిని ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. వారు సమర్పించిన దరఖాస్తుల జిరాక్స్ కాపీలను చూపుతూ ప్రశ్నిస్తున్నారు. తమ పేర్లు ఎందుకు జాబితాలో లేవంటూ ప్రశ్నిస్తున్నారు.

- వరంగల్, జనవరి 20
(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ఓ గదిలో ఉంచిన ప్రజాపాలన దరఖాస్తులు





ఆన్‌లైన్‌లో నమోదు చేయని దరఖాస్తులు

# పక్కకు పడేశారు..!

వరంగల్, జనవరి 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్భాటంగా చేపట్టిన ప్రజా పాలన అభాసుపాలవుతున్నది. 6 గ్యారెంటీల అమలు కోసం దరఖాస్తులు చేసుకున్న వారి ఆశ నిరాశగానే మిగులుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల నుంచి స్వీకరించిన ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదుకు అవకాశం లేకుండా చేసింది. 2024 జనవరి 6 వరకు దరఖాస్తుల స్వీకరణ గడువు ముగియగా, ఆ పిదప 10 రోజుల పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అప్పటి నుంచి కొత్తగా వచ్చిన ఏ దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు. గతంలో స్వీకరించిన వాటినే పక్కన పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలనడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆన్‌లైన్ నమోదును నిలిపివేసిన తర్వాత పేదలు ఇచ్చిన ప్రజా పాలన దరఖాస్తులను అధికార యంత్రాంగం పట్టించుకోలేదు. ఒక్క గ్రేటర్ వరంగల్‌లోనే 15 వేల వరకు దరఖాస్తులను ఆన్‌లైన్ చేయకుండా పక్కకు పడేశారు. ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీలు, ఎంపీడీవో ఆఫీసుల్లోనూ ఇదే పరిస్థితి ఉన్నది. ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను తప్పించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెండోసారి దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశాలు ఇచ్చింది. ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా తమ దరఖాస్తులను ఎలా పరిశీలిస్తారని, లబ్ధిదారులుగా ఎలా గుర్తిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## కనిపించని అర్హుల పేర్లు

జనవరి 26 నుంచి నాలుగు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అర్హుల గుర్తింపు కోసం అధికార యంత్రాంగం ఇంటింటి సర్వే చేస్తున్నది. ఇప్పటికే దరఖాస్తు చేసిన వారి పేర్లతో అధికారులు సర్వే కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా వారికి కొత్తగా వేల కొద్ది దరఖాస్తులు వస్తున్నాయి. పేదలు ముందుగా ఇచ్చిన దరఖాస్తులను పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు ఆరు గ్యారెంటీల అమలు కోసం ప్రజల నుంచి 10 రోజులపాటు దరఖాస్తులు స్వీకరించారు. ఒక్క గ్రేటర్ వరంగల్ పరిధిలోనే రెండు లక్షల అర్జీలు వచ్చాయి. కొత్త రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్ల కోసమే ఎక్కువ మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి ప్రభుత్వం తక్కువ సమయం కేటాయించింది. దీంతో ఆన్‌లైన్ చేసేందుకు ఉన్నతాధికారులు దరఖాస్తులను ఆఫీసు సిబ్బందితోపాటు విద్యార్థులకు అప్పగించగా, నమోదు మొత్తం తప్పుల తడకగా మారింది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వే జాబితాలో అర్హుల పేర్లు కనిపించడం లేదు. ప్రజా పాలనలో దరఖాస్తులు చేసుకున్నామని, జాబితాలో పేర్లు లేవని అధికారులు చెబుతున్నారని పేదలు వాపోతున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన అర్హతలున్నాయని చెబుతున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను తప్పుగా నమోదు చేయడం మూలంగానే జాబితాలో వేల మంది పేర్లు లేవని అంటున్నారు. కొన్ని అర్జీలను అసలు ఆన్‌లైన్‌లోనే నమోదు చేయలేదని తాజాగా తెలుస్తున్నది. సర్వే జాబితాతో ఇంటింటికి వెళ్తున్న అధికారుల వద్దకు కొందరు దరఖాస్తుదారులు వచ్చి తమ సంగతి ఏంటని అడుతున్నారు. అధికారులు పరిశీలిస్తే సర్వే జాబితాలో వారి పేర్లు ఉండడంలేదు. దరఖాస్తుల జిరాక్స్ కాపీలను అధికారులకు చూపిస్తూ తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.



డప్పుచప్పుళ్లతో ర్యాలీగా వస్తున్న ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, మాదిగలు



ర్యాలీలో పాల్గొన్న మందకృష్ణ మాదిగ, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య తదితరులు

## ఇంటికొకరు డప్పుతో రావాలి

- రేవంత్‌రెడ్డి ఒక వర్గానికి తలొగ్గి జాప్యం చేస్తే సహించేది లేదు
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ
- హనుమకొండలో 'లక్ష డప్పులు-వేల గొంతులు' సన్నాహక ర్యాలీ

హనుమకొండ చౌరస్తా, జనవరి 20: ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కోసం డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే 'లక్ష డప్పులు.. వేల గొంతులు' మహాప్రదర్శనలో భాగంగా సోమ వారం హనుమకొండలో సన్నాహక ర్యాలీ తీశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, కొండేటి శ్రీధర్ వేయిస్తంభాల ఆలయంలో రుద్రేశ్వరస్వామి, డప్పుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డప్పుచప్పుళ్లతో ర్యాలీగా అంబేద్కర్ సెంటర్‌లోని విగ్రహం వద్దకెళ్లి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ మహాప్రదర్శనకు ఇంటికొకరు డప్పు వేసుకుని తరలిరావాలన్నారు. 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటాలు చేస్తున్నామని, అన్ని రాజకీయ పార్టీలు, అన్ని వర్గాల ప్రజలు మద్దతు పలికారన్నారు. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం వెంటనే సుప్రీంకోర్టు తీర్పు ఆదేశానుసారం రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఒక వర్గానికి తలొగ్గి వర్గీకరణకు జాప్యం చేస్తే సహించేది లేదని, మాదిగల ఆగ్రహావేశాలకు గురికాక తప్పదని హెచ్చరించారు. మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ విషయంలో మొదటి నుంచి మాదిగలను మోసం చేస్తూ వస్తున్నదన్నారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయకులు ఏపూరి సోమన్న, మిట్టపల్లి సురేందర్, దరువు ఎల్లన్న, గిద్దె రాంనర్సయ్య పాటలతో అలరించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకుడు పృథ్వీరాజ్, మైనార్టీ నాయకులు ఇస్మాయిల్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మంద కుమార్ మాదిగ, వేల్పుల సూరన్న, బొడ్డు దయాకర్, మంద రాజు, బండారి సురేందర్, గద్దల సుకుమార్, బొచ్చు తిరుపతి, మంద స్వరాజ్, కిరణ్, రాజేశ్ పాల్గొన్నారు.

## ముగ్గురు ఇన్‌స్పెక్టర్ల బదిలీ

సుబేదారి, జనవరి 20: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న ముగ్గురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ సీపీ అంబర్‌కిశోర్ ఝా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీపీ కార్యాలయానికి అటాచ్డ్‌గా ఉన్న ఎస్ శ్రీనివాస్‌ను నెక్కొండకు బదిలీ చేయగా, అక్కడ పనిచేస్తున్న చంద్రమోహన్ ఎస్‌బీకి బదిలీ చేశారు. ఎస్‌బీ విభాగంలో పనిచేస్తున్న ప్రతాప్‌ను మల్టీజోన్‌కు బదిలీ చేశారు. అదేవిధంగా ఎల్కతుర్తి ఎస్‌ఐగా ప్రవీణ్‌కుమార్‌ను నియమిస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. కొద్ది రోజుల క్రితం ఇక్కడ పనిచేస్తున్న రాజుకుమార్ సస్పెండ్ కాగా, ఆయన స్థానంలో సీసీఆర్‌పీలో పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్ వచ్చారు.

## నిరుద్యోగ మహిళలకు ఉచిత శిక్షణ

హసన్‌పర్తి, జనవరి 20 : భారతీయ స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ నిరుద్యోగ మహిళలకు బ్యూటీషియన్ కోర్సులో (30 రోజులు) శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ బాసరవి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వయసు 18-45 ఏండ్లలోపు ఉండాలన్నారు. తెల్ల రేషన్‌కార్డున్న వారు 4 ఫొటోలు, ఆధార్ కార్డు, విద్యార్హత జిరాక్స్ కాపీలతో హసన్‌పర్తి సంస్కృతి విహార్‌లోని టీటీడీసీలో 24లోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9704056522, 9849307873, 6281260878, 9949108934 నంబర్లలో సంప్రదించాలన్నారు.

మహా జన సభలో మాట్లాడుతున్న మార్నేని రవీందర్‌రావు



## అవినీతి పేరుతో కక్ష సాధిస్తున్న డీసీవోలు

- డీసీసీబీ మహాజన సభలో డైరెక్టర్లు, పీఏసీఎస్ చైర్మన్ల ఆగ్రహం
- నంబర్ వన్ స్థానంలో వరంగల్ బ్యాంక్: టీజీ క్యాబ్ చైర్మన్ మార్నేని

హనుమకొండ, జనవరి 20: పీఏసీఎస్‌లలో అవినీతి పేరుతో డీసీవోలు కక్ష సాధిస్తున్నారని, ధాన్యం కొనుగోలు బాధ్యతలను అడ్డుకుంటారని డీసీసీ బ్యాంకు డైరెక్టర్లు, పీఏసీఎస్ చైర్మన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ రవీందర్‌రావు అధ్యక్షతన మహాజన సభ జరిగింది. కొందరు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల ఒత్తిడితో పీఏసీఎస్‌లలో అవినీతి పేరుతో విచారణ చేసి రద్దు చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని చైర్మన్లు ఆరోపించారు. ఇలా చేస్తే తాము ఎంత వరకైనా పోయేందుకు సిద్ధమని హెచ్చరించారు. అధికారులు సొసైటీల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

*రూ. 2100 కోట్ల టర్నోవర్*

రాష్ట్రంలోనే వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నంబర్ వన్ స్థానంలో నిలిచిందని, తమ పాలక వర్గం బాధ్యతలు చేపట్టిన తర్వాత అందరి సహకారంతో రూ. 885 కోట్ల నుంచి రూ. 2100 కోట్ల టర్నోవర్‌కు చేరిందని మార్నేని రవీందర్‌రావు అన్నారు. సహకార మిత్ర -2 డిపా జిట్ పథకాన్ని ప్రారంభించారు. 19 నుంచి 32 బ్యాంకు శాఖలకు విస్తరించామని, త్వరలో మండలానికి ఒకటి చొప్పున మరిన్ని బ్రాంచ్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించి ఆర్‌బీఐ అనుమతి కోసం పంపించామన్నారు. ఇతర బ్యాంకులకు దీటుగా రుణాల అందజే స్తున్నామని, డిపాజిట్లపై అధిక వడ్డీ చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో సీఈవో వజీర్ సుల్తాన్, బ్యాంక్ వైస్ చైర్మన్ కుందూరు వెంకటేశ్వర్ రెడ్డి, డైరెక్టర్లు సంపెల్లి నర్సింగరావు, కంది శ్రీనివాస్ రెడ్డి, కేసిరెడ్డి ఉపేందర్ రెడ్డి, కక్కిరాల హరిప్రసాద్, చెట్టుపల్లి మురళీధర్, గుండ్రెడ్డి రాజేశ్వర్ రెడ్డి, దొంగల రమేశ్, నాయిని రంజిత్, మాడుగుల రమేశ్, ఎర్రబెల్లి గోపాలరావు, పోలి పాక శ్రీనివాస్, కే నరేందర్, ఎలుగం రవి రాజా, సంజీవ రెడ్డి, ఏ జగన్‌మోహన్‌రావు, డీజీఎం అశోక్, నాబార్డ్ డీడీ ఏం చంద్రశేఖర్, మార్క్‌ఫెడ్ చైర్మన్ రంగారావు పాల్గొన్నారు.



చెల్పూర్‌లో కేటీపీపీ వద్ద కార్మికుల రిలే దీక్షలో మాట్లాడుతున్న రాష్ట్ర జేఏసీ చైర్మన్ ఈశ్వర్ రావు

## ఆర్టిజన్స్‌ను కన్వర్షన్ చేయాల్సిందే..

- విద్యార్హతలను బట్టి పోస్టింగులివ్వాలి
- హనుమకొండ, భూపాలపల్లి, కేటీపీపీలో కార్మికుల రిలే దీక్షలు

నమస్తే నెట్‌వర్క్ : ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంలలో పనిచేస్తున్న ఆర్టిజన్స్‌ను వెంటనే కన్వర్షన్ చేయాలని విద్యుత్ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు హనుమకొండ ములుగు రోడ్డులోని వరంగల్ ట్రాన్స్‌కో జోనల్, భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని టీజీఎన్పీడీసీఎల్ డీఈ, జనగామలోని కార్యాలయాల ఎదుట, గణపురం మండలంలోని చెల్పూర్ కేటీపీపీ వద్ద సోమవారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ రాష్ట్ర జేఏసీ చైర్మన్ కే ఈశ్వర్ రావు మాట్లాడుతూ 20 వేల మందిని కన్వర్షన్ చేయడం వల్ల విద్యుత్ సంస్థలపై పెద్దగా ఆర్థిక భారం పడదన్నారు. వారి విద్యార్హతలను బట్టి జూనియర్ లైన్‌మెన్, జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ లేదా అటెండర్, సబ్ ఇంజినీర్ పోస్టులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని గతంలోనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ట్రాన్స్‌కో సీఎండీలను కలిసి వినతి పత్రాలను సైతం అందజేశామన్నారు. అదేవిధంగా ఫిబ్రవరి 3 నుంచి 13వ తేదీ వరకు కన్వర్షన్ యాత్ర, 20వ తేదీన హైద రాబాద్‌లో చలో విద్యుత్ సౌధను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో ఆర్టిజన్స్ అందరూ పాల్గొంటారని, అప్పుడు విద్యుత్ సంస్థ కుప్పకూలే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కేటీపీపీ జేఏసీ చైర్మన్, కన్వీనర్ అల్లం ఓదెలు, బీరెల్లి రాజు, వరంగల్ సర్కిల్ జేఏసీ చైర్మన్ బండారి ఐలయ్య, కన్వీనర్ కందికొండ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



వరంగల్ ట్రాన్స్‌కో జోనల్ కార్యాలయం ఎదుట దీక్ష చేస్తున్న ఆర్టిజన్ కార్మికులు




చోరీలకు పాల్పడిన దంపతుల అరెస్ట్‌ను చూపిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

## బస్సుల్లో చోరీలకు పాల్పడిన దంపతుల అరెస్ట్

*100 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం*

సుబేదారి, జనవరి20: ఆర్టీసీ బస్సుల్లో చోరీలకు పాల్పడిన దంపతులను పోలీసులు అరెస్ట్ చేసి,100 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం హనుమకొండ పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ దేవేందర్‌రెడ్డి నిందితుల అరెస్ట్‌ను చూపించి, వివరాలు వెల్లడించారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాటారానికి చెందిన దివ్యాంగురాలు చెల్ల స్వప్న, మద్దూరి సత్యనారాయణ దంపతులు జల్సాలకు అలవాటుపడి హనుమకొండ కుమార్‌పల్లిలో నివాసం ఉంటూ చోరీలకు పాల్పడ్డారు. గతేడాది ఫిబ్రవరి, మార్చి, డిసెంబర్‌లో హనుమకొండ బస్‌స్టేషన్‌లో బస్సు ఎక్కుతున్న మహిళా ప్రయాణికుల మెడలో, బ్యాగుల నుంచి బంగారు ఆభరణాలు అపహరించారు. ఈ చోరీలపై సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా ఆదేశాల మేరకు పోలీసులు నిఘా పెట్టి, పక్కాసమాచారంతో సాంకేతిక పరిజ్ఞానంతో హనుమకొండ టైలర్ స్ట్రీట్‌లో సోమవారం నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని ఏసీపీ తెలిపారు.

## మౌలిక వసతులు కల్పించాలి

*తహసీల్ ఎదుట జక్కలొద్ది గుడిసెవాసుల ధర్నా*

ఖిలావరంగల్, జనవరి 20: జక్కలొద్దిలోని గుడిసెవాసుల కాలనీలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే నిర్వహించి, మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ సోమవారం ఖిలావరంగల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా గుడిసెవాసుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం సాగర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం 58 జీవో ద్వారా క్రమబద్ధీకరించేందుకు సర్వే చేసిందన్నారు. కాంగ్రెస్ సొంత స్థలం ఉంటే ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని చెప్పిందన్నారు. అయితే, హామీలను అమలు చేయకుండా గుడిసెలను తొలగించే కుట్రలు చేస్తున్నదని ధ్వజమెత్తారు. సంఘం కార్యదర్శి ప్రత్యూష, లక్ష్మణ్, అనిల్, వెంకన్న, ముంతాజ్, లావణ్య, రఘుపతి, దివ్య, జమున, కళావతి, పుష్ప, భాగ్య పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న గుడిసె వాసులు

## ఆర్టీసీకి సంక్రాంతి ఆదాయం రూ.33 కోట్లు

హనుమకొండ చౌరస్తా, జనవరి 20 : సంక్రాంతి పండుగ సందర్భంగా ఆర్టీసీకి కాసుల వర్షం కురిసింది. వరంగల్ రీజియన్‌కు పండుగ ఆదాయం రూ. 33 కోట్లు వచ్చింది. వరంగల్ రీజియన్ పరిధిలో హనుమకొండ, వరంగల్ 1, వరంగల్ 2, పరకాల, భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్, నర్సంపేట, తొర్రూరు డిపోల పరిధిలో ఈ నెల 7 నుంచి 19 వరకు ప్రత్యేక బస్సులు నడిపింది. మొత్తంగా 927 బస్సులు సుమారు 30 లక్షల కిలోమీటర్ల మేర నడిపించగా 12 రోజుల్లో సుమారు 50 లక్షల మంది ప్రయాణించారు. ఇందులో మహాలక్ష్మీ పథకం కింద 20 లక్షల మంది మహిళలు ఆర్టీసీ సేవలు వినియోగించుకున్నారు. ఒక్క ఆదివారమే 250 బస్సులు నడిపించగా రూ.2.40 కోట్ల ఆదాయం సమకూరింది. 14 రోజుల పాటు సుమారు 6 వేల బస్సులు నడిపామని, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గమ్యస్థానాలకు చేర్చామని ఆర్ఎం విజయభాను తెలిపారు.

